'వడ్డెరలను ఎస్టీలో చేర్చాలి'


బోదాస్ నరసింహ

లాలాపేట: తెలంగాణలోని వడ్డెర కులస్తులను ఎస్టీలో చేర్చాలని హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు బోదాస్ నరసింహ డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన తెలంగాణ వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వాలు ఓటు బ్యాంక్‌గానే తమను వాడుకున్నాయని అందుకే కులస్తులు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా వడ్డెరలు అభివృద్ధి చెందాలంటే తమను ఎస్టీ రిజర్వేషన్ జాబితాలో చేర్చాలని కోరారు. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ఐలమల్లు వేముల శ్రీనివాస్‌ను సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పిట్ల మల్లేశ్, ఉపాధ్యక్షుడు శ్రీశైలం తదితరులు ఉన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ అదృశ్యం

అమీర్‌పేట: ఏఆర్ కానిస్టేబుల్ అదృశ్యమైన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ సిఖ్ విలేజ్‌కు చెందిన విగ్నేందర్ (29 హెడ్ క్వార్టర్స్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ప్రస్తుతం మాదన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధి పికెట్‌లో విధులు నిర్వహిస్తున్న విగ్నేందర్ 6 రోజుల నుంచి విధులకు రాకపోవడంతో తోటి ఉద్యోగి ప్రవీణ్, తండ్రి మహేందర్‌కు ఫోన్‌చేసి చెప్పాడు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో బల్కంపేటలో ఉంటున్న విగ్నేందర్ భార్య జ్ఞానప్రసన్న వద్దకు వచ్చి అడగగా తనకూ తెలియదని చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఐదేళ్ల క్రితం వీరి వివాహం కాగా ప్రస్తుతం వీరికి ఒక కుమార్తె ఉంది.మనస్పర్థల కారణంగా మూడేళ్ల నుంచి వేర్వేరుగా ఉంటున్నారని, తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బీసీ బిల్లు అమలుకు పిటిషన్ వేయాలి

కాచిగూడ: బీసీ బిల్లు అమలు కోసం ప్రజా పోరాటంతో పాటు న్యాయపోరాటం చేయాల్సిన అవసరం ఉందని, సుప్రీంకోర్టులో మాండమస్ పిటిషన్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్లాలన్నారు. ప్రభుత్వం ఘర్షణ పద్ధతిలో కాకుండా ప్రత్యామ్నాయ పద్ధతి ఆలోచించి రిజర్వేషన్లను పెంచే న్యాయ మార్గాన్ని ఆలోచించాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించి ధర్నాలు చేస్తే సరిపోదని, రిజర్వేషన్ల సాధన కోసం కేంద్రంతో సానుకూలంగా ఉండి అఖిల పక్షంతో అన్ని రాజకీయ పార్టీలతో మాట్లాడి పరిష్కరించాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బీసీ రిజర్వేష్ బిల్లులు రాష్ట్రపతి వద్ద మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఈ బిల్లులపై రాష్ట్రపతి ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం బీసీ సామాజిక వర్గాల హక్కులను ఆలస్యం చేస్తోందనే ఆందోళనలను రేకెత్తిస్తోందన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో మాండమస్ పిటిషన్ దాఖలు చేయాలని గుజ్జ సత్యం డిమాండ్ చేశారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

చిక్కడపల్లి: యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, యూత్ మేళాలను వంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. జనరంజని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గిడియాన్‌బాబుబాబు ఆధ్వర్యంలో ఆదివారం గోల్కొండ చౌరస్తాలోని ఎం.బి.చర్చిలో నిర్వహించిన యూత్ మేళాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఠాగోపాల్ మాట్లాడుతూ చదువులు పూర్తయిన విద్యార్థులు నిత్యం కొత్త అంశాలను నేర్చుకోవాలని సూచించారు. అధునాతన సాంకేతికను సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. ఈ సందర్భంగా యూత్ మేళాను ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనాయకుడు ముఠా జయసింహ, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపాన్ జాన్ ఉమ్మడి దీవేల్, డాక్టర్ సామ్ అబ్రహం, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రావులపాటి మోజస్, కమిటీ సభ్యులు కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



కాచిగూడ: రైల్వేట్రాక్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్. ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... శివారం పల్లి-బుద్వేల్ రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (40) ఆరాంఘర్ బ్రిడ్జి రైల్ ట్రాక్ వద్ద పడి చనిపోయి ఉన్నాడు. మృతదేహాన్ని పోలీసులు ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


టీచర్స్ కాలనీలోని కనకదుర్గమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్యే శ్రీ గణేశ్


బోనాలతో మహంకాళి ఆలయానికి వస్తున్న భక్తులు


బోయిగూడలో బోనాల వేడుకల్లో కుటుంబ సభ్యులు

కనుల పండువగా అమ్మవారి బోనాలు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించారు. భక్తులు ఆలయాలకు తరలివచ్చి అమ్మవారికి బోనం, సాక సమర్పించారు. బన్సీలాల్‌పేట్, బోయిగూడ, బోలక్‌పూర్, ఐడిహెచ్ కాలనీ, బండమైసమ్మనగర్, చాచానెహ్రూనగర్, గాంధీనగర్, బీజేఆర్ నగర్, అంబేడ్కర్ నగర్ ప్రాంతాల్లో అమ్మవారి బోనాల సంబరాలు అంబరాన్ని తాకాయి. తీన్‌మార్ డప్పుచప్పుళ్లు..యువకుల నృత్యాలతో దేవాలయాల పరిసరాలు, బస్తీలు సందడిగా కనిపించాయి.

ప్రముఖుల పూజలు..

బోనాల పండుగ సందర్భంగా బన్సీలాల్‌పేట్ పరిసర ప్రాంతాల్లోని పలు దేవాలయాలను సందర్శించి పలువురు నాయకులు, రాజకీయ ప్రముఖులు ప్రత్యేక పూజలు చేశారు. కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, బీజేపీ నాయకులు, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, కార్పొరేటర్ కె. హేమలత బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు దేవాలయాల్లో జరిగిన బోనాల వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబేడ్కర్ నగర్‌లో జరిగిన బోనాల వేడుకల్లో మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ పాల్గొన్నారు.


బోనాల వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

పలహార బండ్ల ఊరేగింపు..

బోనాల వేడుకల సందర్భంగా అమ్మవారి పలహారపు బండ్ల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో సాగింది. పోతరాజుల నృత్యాలు, యువకుల వీరంగాలు, తీన్‌మార్ డప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారి పలహారపు బండ్ల ఊరేగింపు వివిధ ప్రాంతాల మీదుగా సాగింది. బన్సీలాల్‌పేట్, బీజేఆర్ నగర్, బండమైసమ్మ నగర్, న్యూబోయిగూడ తదితర ప్రాంతాల్లో బొడ్డు మహేష్, ఎం. రవికుమార్ తదితరుల అధ్వర్యంలో పలహారపు బండ్ల ఊరేగింపు నిర్వహించారు.

రాంగోపాల్‌పేట్‌లో..

రాంగోపాల్‌పేట్: రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. బోనాల సందర్భంగా డివిజన్‌లోని నల్లగుట్ట, అంబేడ్కర్‌నగర్, వెంగళరావునగర్, కళాసీగూడ, భ్రమరాంబ, సుందరమ్మ, కొండపోచమ్మ, రేణుక ఎల్లమ్మ, ఉప్పలమ్మ తదితర దేవాలయాల్లో బోనాల జాతర వైభవంగా నిర్వహించారు.

'బోనమెత్తిన' కంటోన్మెంట్

రసూల్‌పురా, బొల్లారం: కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఆదివారం శ్రావణ మాస బోనాల సందడి నెలకొన్నది. కంటోన్మెంట్ మూడో వార్డు కార్ఖానా మహంకాళి ఆలయం, మడ్ ఫోర్ట్ ముత్యాలమ్మ ఆలయం, అంబేడ్కర్ హాట్స్‌లోని రేణుకా ఎల్లమ్మ, తిరుమలగిరి టీచర్స్‌కాలనీలోని కనకదుర్గమ్మ, కంటోన్మెంట్ ఏడో వార్డులోని ఆర్టీసీ కాలనీ, లాలమియా బస్తీ మహంకాళి ఆలయాల్లోని అమ్మవార్లకు మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద, బోర్డు మాజీ సభ్యురాలు అనితాప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్. శ్రీనివాస్ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మాధవ్ సింగ్, సాంబ, అశోక్, వెంకట్ రాముడు, ఉత్తరయ్య, ఉపాధ్యక్షుడు ప్రభాకర్, జనరల్ సెక్రటరీ సంతోష్ కుమార్, జితేందర్, మురళి, కిరణ్ కుమార్, రామారావు, విజయరావు, మహేందర్, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో బోర్డు మాజీ సభ్యురాలు అనితా ప్రభాకర్


న్యూబోయిగూడలో జరిగిన బోనాల వేడుకల్లో మర్రి శశిధర్‌రెడ్డి


అంబేద్కర్ నగర్‌లో..


నల్లగుట్టలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర


కళాసీగూడలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి


రాంగోపాల్‌పేట్‌లో..

మీ పర్యటనలో ఎమ్మెల్యే ఉంటే బాగుండేది

సీఎంకు తెలిపిన బీఆర్ఎస్ నేతలు

అమీర్‌పేట: బౌద్ధనగర్,గంగుబాయి బస్తీలో వరద ముంపు పరిశీలనకు రావడం మంచిదేనని, స్థానిక ఎమ్మెల్యే మీ పర్యటనలో ఉంటే సమస్యపై పూర్తి సమాచారం తెలిసి ఉండేదని బీఆర్ఎస్ అమీర్‌పేట డివిజన్ అధ్యక్షులు హనుమంత్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి తెలిపారు. సీఎం వచ్చిన విషయం తెలుసుకున్న కొందరు బీఆర్ఎస్ నాయకులు సీఎంను కలిసేందుకు రాగా సెక్యూరిటీ సిబ్బంది అనుమతించలేదు.ఈ విషయాన్ని గుర్తించిన సీఎం వారిని ఆపవద్దని చెప్పడంతో సీఎంను కలిశారు.వరద సమస్యపై సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు పూర్తి అవగాహన ఉందని,ఆయన్ను కూడా పిలువాల్సి ఉండేదన్నారు. సీఎం స్పందిస్తూ ఆకస్మిక పర్యటన కావడంతో పిలువలేదని, మరోసారి వస్తే తప్పక పిలిచి మాట్లాడతామన్నారు.

ఘనంగా గురుపూజ వార్షికోత్సవం



పద్మారావునగర్: సుప్రసిద్ధమైన శ్రీ గోపాల్ దాస్ భజన మండలి 77వ గురు పూజ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బన్సీలాల్‌పేట్ శ్మశానవాటిక ఆవరణ లోని గోపాల్‌దాస్ మఠంలో మఠం పీఠాధిపతి శరణ్‌దాస్(శంకర్‌బాబు) ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మధ్యప్రదేశ్ నుంచి సంత్‌బోధు ప్రియసాహెబ్, సాధ్వి విజితాసాహెబ్, భీష్మశరణ్‌సాహెబ్, సాధ్వి సునీతసాహెబ్ పాల్గొని భక్తి విశిష్టత, జీవన ముక్తిమార్గం ప్రవచనలు వినిపించారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌దాస్ భజన మండలి అధ్యక్షులు కిషోర్ కుమార్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌బాబు, రాంబాబు, మహేందర్, శ్రావణ్, ఆర్. మార్కెండయ్య, ఎస్ఎన్ శంకర్, ఎస్. లింగం, గణేష్ పాల్గొన్నారు.

'కమ్యూనిస్టు యోధుడు తరిమెల నాగిరెడ్డి'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విప్లవ కమ్యూనిస్టు యోధుడు తరిమెల నాగిరెడ్డి వర్ధంతి సభను ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నాగిరెడ్డి మిత్ర బృందం నిర్వహించింది. ఈ సందర్భంగా నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి వారు నివాళులర్పించారు. అనంతరం సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... భారత ప్రజా విప్లవ పందాను ఎలిగెత్తి చాటిన మహనీయుడని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, విప్లవ కవి నిఖిలేశ్వర్, సత్యనారాయణరెడ్డి, సదానందం తదితరులు పాల్గొని ప్రసంగించారు.

'రోగ నిరోధక శక్తి ఎక్కువైనా ప్రమాదమే'


సదస్సులో పాల్గొన్న వైద్యులు

రాంగోపాల్‌పేట్: మనిషి శరీరంలో ఉండే రోగ నిరోధక శక్తి బయటి నుంచి వచ్చే బ్యాక్టీరియా, ఇన్ఫెక్షన్లపై పోరాడుతుందని కానీ అది ఎక్కువైతే శరీరంలోని అవయవాలనే శత్రువులుగా భావించి వాటిపై దాడి చేస్తుందని ప్రపంచ ప్రఖ్యాత పిడియాట్రిక్ రుమటాలజిస్ట్, ఇమ్యునాలజిస్ట్ డాక్టర్ సూర్జిత్‌సింగ్ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో పిడియాట్రిక్ రుమటాలజిపై జరిగిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. రోగి నిరోధక శక్తి పెరగడం వల్ల వాస్కులైటీస్, ఆర్థరైటీస్, కవాసాకి డిసీజ్ లాంటి అత్యంత ప్రమాదకరమని అయితే ఇవి ఎక్కువగా పిల్లలకే సోకుతాయన్నారు. ఈ సదస్సులో సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు, వైద్యులు వీరవల్లి శరత్ చంద్రమౌళి, బాబు ఎస్ మదార్కర్, అబర్నా తంగరాజ్, పరాగ్ శంకర్‌రావు పాల్గొన్నారు.

ముగిసిన ఆలిండియా ఆర్పీఎఫ్ అథ్లెటిక్స్ పోటీలు

అడ్డగుట్ట: సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ గ్రౌండ్‌లో కొనసాగుతున్న ఆలిండియా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ 32వ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. 17 జోన్ల రైల్వేల నుంచి వచ్చిన 232 మంది క్రీడాకారులు వివిధ పోటీల్లో పాల్గొని సత్తాచాటారు. ముఖ్య అతిథిగా దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ హాజరై మాట్లాడుతూ.. ఏటా నిర్వహించే ఆర్పీఎఫ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల ద్వారా క్రీడాకారుల్లోని నైపుణ్యం, సంకల్పం, క్రీడాస్ఫూర్తి వెలువడుతాయన్నారు. సదరన్ రైల్వే మొదటి స్థానంలో నిలవగా, ఈస్టర్న్ రైల్వే రెండో స్థానం, దక్షిణ మధ్య రైల్వే మూడో స్థానంలో నిలిచాయి. ప్రతిభ చూపిన వారిలో బెస్ట్ మేల్ అథ్లెట్‌గా సదరన్ రైల్వేకు చెందిన ఎన్. సెంథిల్‌కుమార్, బెస్ట్ ఫీమేల్ అథ్లెట్‌గా దక్షిణ మధ్య రైల్వేకు చెందిన శుభ శ్రీలకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డీఆర్ఎం గోపాలకృష్ణన్, హైదరాబాద్ డీఆర్ఎం లోకేష్ విష్ణోయ్, ఆర్పీఎఫ్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ

రిజర్వేషన్లు ప్రధాని మోదీతోనే సాధ్యం

కాచిగూడ: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఆగస్టు 18, 19న బీసీల చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. 18 బీసీ సంఘాలు, విద్యార్థి, ఉద్యోగ, కుల సంఘాల సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాజ్యాధికారంలో బీసీల వాటాకై ఢిల్లీలో జాతీయ స్థాయిలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. చట్టసభల్లో రిజర్వేషన్లు ప్రధాని నరేంద్రమోదీతోనే సాధ్యమవుతుందని అన్నారు. అది త్వరలోనే సాకారం కానుందని ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా జనాభా గణనతో పాటు కులగణన చేపట్టబోతుందని ఆయన తెలిపారు. కులగణన తర్వాత బీసీలకు అన్ని రంగాల్లో జనాభా ప్రకారం వాటా లభిస్తుందన్నారు. సమాజంలో విప్లవాత్మకమైన మార్పు వస్తుందని పేర్కొన్నారు. రూ.75కోట్లకు పైగా ఉన్న బీసీల చిరకాల కులగణన డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం గౌరవించినట్లుగానే, చట్ట సభల్లో రిజర్వేషన్లను మోదీ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కులగణన విషయంలో 1931లో బ్రిటీష్ ప్రభుత్వం తీసిన లెక్కల తరువాత నరేంద్రమోదీ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయం తీసుకుందని ఆయన ప్రశంసించారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

కాచిగూడ: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బెంగళూర్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీ నుంచి 18 మంది విద్యార్థులు పాల్గొని కటా, కుమితి విభాగాల్లో 29 బంగారు పతకాలు, 6 రజత పతకాలతో పాటు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఆదివారం బర్కత్‌పురలోని తన నివాసంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభినందించారు. కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్. గోపాల్‌రెడ్డి, లక్కాకుల అన్విత్ పటేల్, గీతేష్, నవీన్ పాల్గొన్నారు.

నీటికుంటను అందుబాటులోకి తెస్తాం.. బతుకమ్మ ఆడిస్తాం

హైడ్రా కమిషనర్ రంగనాథ్


స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ గంగుబాయి బస్తీలో గతంలో ఉన్న నీటి కుంటను తిరిగి అందుబాటులోకి తెచ్చి బతుకమ్మ ఆడిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు.ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ముందుగానే అమీర్‌పేటకు వచ్చిన ఆయన గంగుబాయి బస్తీకి చెందిన ప్రజలతో మాట్లాడారు.సుమారు 25 ఏళ్ల క్రితం నీటి కుంట ఉండేదని, అందులో బతుకమ్మ ఆడేవారని వివరించారు.కొందరు కుంటను పూడ్చి అడ్డుగా ప్రహరీ నిర్మించి ప్రైవేటు ఆసుపత్రి పార్కింగ్ స్థలంగా మార్చుకున్నారన్నారు. మరో స్థలంలో బహుళ అంతస్తుల భవనం నిర్మించారన్నారు. స్పందించిన కమిషనర్ రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

బయో టాయిలెట్లకు మోక్షమెప్పుడో..?

- అడ్డగుట్ట డివిజన్‌లో కానరాని పబ్లిక్ టాయిలెట్స్
- అత్యవసర సమయాల్లో ప్రయాణికులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


తుకారాంగేట్‌లో రోడ్డు పక్కనే ఉన్న పట్టాల వద్ద మూత్ర విసర్జన చేస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: 'స్వచ్ఛ హైదరాబాద్, సాఫ్ హైదరాబాద్, షాన్‌దార్ హైదరాబాద్' పేరిట జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నా అధికారులు బయో టాయిలెట్ల ఏర్పాటు విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం కనబరుస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేయవద్దని చెబుతున్నా.. జీహెచ్ఎంసీ అధికారులు ప్రయాణికుల సౌకర్యార్థం మాత్రం పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేయడం లేదు. దీంతో ప్రయాణికులకు అత్యవసర సమయాల్లో ఇబ్బందులు తప్పడం లేదు.

ఇబ్బందులు వర్ణనాతీతం..

పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడంతో పలువురు పాదచారులు ఎక్కడ పడితే అక్కడే మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో అటు వైపు నుంచి వెళ్లే పాదచారులు, ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డివిజన్‌లోని అడ్డగుట్ట బస్టాండ్ నుంచి శాంతినగర్ వరకు ఒక్క బయో టాయిలెట్ కూడా లేకపోవడం గమనార్హం.

అధ్వానంగా లాలాగూడ రైల్వేస్టేషన్, మిలిటరీ ట్రాక్‌లు..

సికింద్రాబాద్ నుంచి మల్కాజిగిరి, లాలాపేట్, శాంతినగర్, మెట్టుగూడ, తార్నాక వెళ్లే చాలామంది ప్రయాణికులు అడ్డగుట్ట మీదుగా మార్గాన్ని ఎంచుకుంటారు. ఇక్కడి నుంచి చాలా తొందరగా వారి వారి గమ్యస్థానాలకు వెళ్లేందుకు షార్ట్‌కట్ ఉండడంతో ఈ మార్గం నుంచే వెళ్తుంటారు. అయితే వారికి అత్యవసర సమయాల్లో ఎటువెళ్లాల్లో పాలుపోక స్థానిక ఖాళీ ప్రదేశాల్లో మూత్ర విసర్జన కానిచ్చేస్తున్నారు. లాలాగూడ రైల్వేస్టేషన్, తుకారాంగేట్‌లోని సుభాష్ విగ్రహం సమీపంలోని మిలిటరీ పట్టాల వైపు ఖాళీ ప్రదేశాలను అధ్వానంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలి



అడ్డగుట్ట, తుకారాంగేట్, లాలాగూడ రైల్వేస్టేషన్, శాంతినగర్లలోని ప్రధాన రోడ్డు మార్గంలో పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయడం ఎంతో అవసరం. ఇంత పెద్ద స్లమ్‌లో ఒక్క మూత్రశాల కూడా లేకపోవడం దురదృష్టకరం. పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో పలువురు పాదచారులు, ప్రయాణికులు ఎక్కడపడితే అక్కడే మూత్ర విసర్జన చేస్తున్నారు. ఇప్పటికైనా అడ్డగుట్ట డివిజన్‌లో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటుకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– శివాజీ, బీజేవైఎం నగర కార్యదర్శి